క్లుప్తంగా

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



సీబీఎస్సీ బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో ఏపీ, తెలంగాణ సీబీఎస్‌సీ బ్యాడ్మింటన్ పోటీలు స్కూల్ డైరెక్టర్ విజయ్ ప్రకాష్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పి.రాజశేఖర్ హాజరయ్యారు. గౌరవ అతిథులుగా ఒలింపిక్ సంఘ మాజీ కార్యదర్శి కె.పద్మనాభం, జిల్లా బ్యాడ్మింటన్ సంఘ ప్రతినిధులు ప్రసాద్‌వర్మ, కర్రి భామిరెడ్డి, కృష్ణమూర్తి, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు హాజరయ్యారు. ఈ నెల 9 నుంచి 11 వరకూ జరిగే పోటీల్లో ఏపీ, తెలంగాణ నుంచి 500 మంది క్రీడాకారులు హాజరవుతున్నారు. తొలిరోజు నిర్వహించిన పోటీలను టోర్నమెంట్ పరిశీలకులు గణేష్, జాతీయ స్థాయి రిఫరీలు పి.శ్రీనివాస్, భద్రం పర్యవేక్షించారు. సుభానికేతన్ జట్టు కాకతీయ పబ్లిక్ స్కూల్ పై 2-1 స్కోర్‌తో, సిల్వర్ ఓక్స్ స్కూల్ జట్టు నీలకాంత్ విద్యాపీఠం జట్టుపై 2-0 స్కోర్‌తో, భావనాస్ శ్రీరామకృష్ణ జట్టు ఆర్యభట్టా జట్టుపై 2-0 స్కోర్‌తో, గాంధీయం జట్టు సిస్టర్ నివేదిత జట్టుపై 2-1 స్కోర్‌తో, డీపీఎస్ జట్టు దద్రక్ మోడల్ స్కూల్ జట్టుపై 2-0 స్కోర్‌తో విజయం సాధించాయి.

రాష్ట్ర స్థాయి షటిల్ పోటీల్లో ప్రథమం



ప్రథమ బహుమతి అందుకున్న హరికృష్ణ, చరణ్‌రామ్

సామర్లకోట: విశాఖ జిల్లా గాజువాకలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-19 షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సామర్లకోట మండలం అచ్చంపేటకు చెందిన వీరంరెడ్డి హరికృష్ణ జంట ప్రథమ బహుమతి సాధించింది. హరికృష్ణ తండ్రి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని శనివారం ఈ విషయం తెలిపారు. హైదరాబాద్‌లోని అకాడమీలో శిక్షణ పొందుతున్న హరికృష్ణ, టి.చరణ్‌రామ్ (చిత్తూరు జిల్లా) జంట విశాఖ జిల్లా గాజువాకలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారని వివరించారు. ఫైనల్స్‌లో శుక్రవారం రాత్రి విశాఖకు చెందిన బాలప్రణయ్, నెల్లూరుకు చెందిన మహీధర్ జంటపై 21-19, 21-18తో విజయం సాధించారని తెలిపారు. హరికృష్ణను వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, మండల అధ్యక్షుడు తలారి దొరబాబు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోరంపూడి శ్రీరంగనాయకులు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్ అభినందించారు.

ద్వాదశ పుణ్యనదీ జలాలతో అభిషేకం



స్వామివారికి ద్వాదశ నదీ జలాలతో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై శ్రీదేవి, భూదేవి సమేతుడై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి శనివారం ద్వాదశ (12) పుణ్యనదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన శ్రవణం, శ్రావణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, కమిటీ సభ్యుల ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. గంగ, యమున, సరస్వతి, గోదావరి, నర్మద, సింధు, కావేరి, కృష్ణ, తపతి, తుంగభద్ర, భీమ, ప్రాణహిత నదీ జలాలతో ఈ అభిషేకం చేశారు. అనంతరం, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర సహిత మహా సుదర్శన యాగం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై ప్రతిజ్ఞ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలోని రామానుజన్ భవన్ సెమినార్ హాల్‌లో డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు శనివారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు బీవీఎస్ఎస్ ఉదయ్‌నాథ్, సంస్కృతి వర్మ, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీటీబీకే విద్యాసాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మనోహారం

- మట్టిని నమ్ముకుంటున్న రైతన్నలు
- పొలం బాట పట్టిన విద్యార్థులు
- క్షేత్రస్థాయిలో అన్నదాత కష్టాన్ని తెలుసుకున్న వైనం

కరప: వారంతా మట్టినే నమ్ముకున్నారు.. రోజూ పొలంలో ఆ మన్నులోనే ఉంటుంటారు.. దేశానికి అన్నం పెట్టేందుకు ముందుకు 'సాగు'తుంటారు.. అలాంటి రైతు కష్టాన్ని క్షేత్ర స్థాయిలో తెలుసుకోవాలన్న ఉత్సుకతతో ఆ విద్యార్థులంతా పొలం బాట పట్టారు.. తరగతి గదిలో బలపం పట్టి పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారులు వ్యవసాయాన్ని దగ్గరుండి చూశారు. పచ్చని పొలాలు మనోహరమే అంటూ మురిసిపోయారు.

కరప మండలం నడకుదురులోని మండల ప్రజా పరిషత్ మోడల్ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకూ 60 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల తరగతి గదుల పక్కనే పంట పొలాలు ఉండటంతో పొలాల్లో రైతులు, కూలీలు చేస్తున్న పనులను చూసి వరి పంట ఎలా పండిస్తారో తెలుసుకోవాలన్న విద్యార్థుల ఉత్సుకతను ఉపాధ్యాయుడు వాకాడ వెంకటరమణ గమనించారు. వెంటనే విద్యార్థులను వెంట పెట్టుకుని పంట పొలాలకు తీసుకెళ్లారు. తల్లిదండ్రులు తిట్టారనో, అడిగింది కొనలేదనో పిల్లలు కోపగించి అన్నం తినడం మానేస్తారు. ఏదైనా ఫంక్షన్లకు వెళ్లినప్పుడు అవసరానికి మించి అన్నం, వంటకాలు పెట్టించుకుని, తినకుండానే పారేస్తుంటారు. రైతులు వరి పంట పండించి, బియ్యంగా మార్చడానికి పడే కష్టం తెలుసుకుంటే ఆహార పదార్థాలను వృథా చేయకుండా ఉంటారని ఈ క్షేత్ర పర్యటన చేయించారు.

పంట పండిస్తారిలా..

రైతు ఆరు నెలలు కష్టపడితేనే కానీ పంట చేతికి రాదు. ఎండనక, వాననక రైతు పొలాల్లో తిరుగుతూ వరి పంట పండిస్తారు. విత్తన సేకరణ నుంచి, దుక్కి దున్ని నారుమడి తయారు చేసి, దమ్ము చేసి, వరి నాట్లు వేస్తారు. అక్కడ నుంచి పంట చేతికి వచ్చే వరకూ ప్రతి రోజూ కాలువ గట్లు, పంట పొలాల్లో విషసర్పాల బారిన పడకుండా తిరుగాడుతూ, వరి చేనును కంటికి రెప్పలా కాపాడుకుంటాడు. పంటకు తెగుళ్లు రాకుండా, ఎలుకల బెడద నుంచి రక్షణ కల్పిస్తారు. తుపాన్లు, అధిక వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే రైతు తల్లడిల్లిపోతాడు. అటువంటి అన్నదాతను ప్రతి ఒక్కరూ చులకనగా చూస్తారు. మట్టి పిసుక్కునే రైతుకు ఏమీ తెలియదని ఒక్కమాటతో తీసి పారేస్తుంటారు. పంట పండించేందుకు రైతు పడే కష్టం చూస్తే రైతును రాజుగా చూస్తారు. ఇన్ని ఒడిదొడుకులు, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రైతు పంట పండిస్తేనే, మన ఐదువేళ్లూ నోట్లోకి వెళ్లి, కడుపు నిండుతుందని విద్యార్థులకు ఆ ఉపాధ్యాయుడు వివరించారు.



పంట పొలంలో కలుపు మొక్కలను పరిశీలిస్తున్న విద్యార్థులు

కలుపు తీసి.. కష్టం తెలుసుకుని

మోడల్ పాఠశాల విద్యార్థులు రైతులు పంటలు ఎలా పండిస్తారో తెలుసుకునేందుకు పంట కాలువపై ఉండే పట్టిని దాటుకుంటూ పొలాల్లోకి వెళ్లారు. అక్కడ రైతులు, కూలీలను కలసిన విద్యార్థులు వరి పంటను పండించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. విత్తన సేకరణ నుంచి వరి నాట్లు వేయడం, రసాయనిక ఎరువులు వాడకం, కలుపు తీత, సస్యరక్షణ, వరికోత, కుప్పనూర్పిడి వివరించి, ధాన్యం ఎలా వస్తుందో విద్యార్థులకు రైతులు వివరించారు. అక్కడ పొలంలో కూలీలు కలుపు తీయడాన్ని పరిశీలించారు. అవగాహన చేసుకున్న విద్యార్థులు ఉత్సాహంగా కూలీలతోపాటు పొలంలో కలుపుతీసి రైతుల కష్టాన్ని స్వయంగా తెలుసుకున్నారు. తరగతిలో పుస్తకాల్లో ఉండే పాఠ్యాంశాలను చదవడమే కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవగాహన చేసికుంటే జీవితాంతం గుర్తుండిపోతాయని ఉపాధ్యాయుడు వెంకటరమణ విద్యార్థులకు వివరించారు. రైతు కష్టాన్ని గుర్తెరిగి తినే పదార్థాలను వృథా చేయవద్దని ఆయన వారికి అవగాహన కల్పించారు.



పంట కాలువపై పట్టిని దాటుతున్న విద్యార్థులు

సాంకేతిక పరిజ్ఞానం నైతికంగా ఉపయోగించాలి

బాలాజీచెరువు: సాంకేతిక పరిజ్ఞానం నైతికంగా ఉపయోగించాలని జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. స్థానిక జేఎన్‌టీయూలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు సాంకేతిక పరిష్కారాలు కనుగొనాలని, సామాజిక ప్రాజెక్టులు చేపట్టాలని సూచించారు. రెక్టార్ వీవీ సుబ్బారావు, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ లైజన్ ఆఫీసర్ కుమారస్వామి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు సహకారం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు తెలిపారు. స్థానిక ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన భవనంలో స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్ ప్రారంభోత్సవం శనివారం జరిగింది. తొలుత పైడా వెంకటనారాయణ సుశీలమ్మ రోటరీ సెంట్రల్ ఫిజియోథెరపీ సెంటర్ మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు బహూకరించారు. రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ అధ్యక్షురాలు ఉమా, సెక్రటరీ వీరబాబు, రోటరీ గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి, మాజీ గవర్నర్ వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమ పూజలు



కరప ఉప్పాలమ్మ గుడిలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



ఉప్పాలమ్మ వారు

కరప: స్థానిక గ్రామ దేవత ఉప్పాలమ్మతల్లి ఆలయంలో శనివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కరప, పరిసర గ్రామాల నుంచి 400 మంది మహిళలతో వేద పండితులు మాచరి సత్యకామేశ్వర పురుషోత్తమశర్మ పూజాదికాలు చేయించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున సామూహిక కుంకుమ పూజలు చేయిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ తెలిపారు. గొర్రెల పెద్దకాపు మనవడు సాయివెంకటవంశీ భక్తులకు భోజన వసతి కల్పించారు. ఈ ఏర్పాట్లను పాట్నీడి సత్యభీమేశ్వరరావు, నక్కా వీరభద్రరావు, రామకృష్ణ, గొర్రెల శ్రీనివాస్, దేవు వీరబాబు, నున్న నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

- శ్రావణ పౌర్ణమి సందర్భంగా షిరిడీ సాయిబాబా మందిరాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నడకుదురు, గురజనాపల్లి, వేళంగి, సిరిపురం, వేములవాడ, కొరుపల్లి, పెద్దాపురప్పాడు, గొడ్డటిపాలెం గ్రామాల్లోని షిరిడీసాయి మందిరాల్లో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.
- మండలంలోని పలు గ్రామాల్లో జంధ్యాల పౌర్ణమి పూజలు జరిపారు. శ్రావణ మాసం పౌర్ణమి రోజు లక్ష్మీదేవికి ప్రీతిపాత్రమైందని, ప్రత్యేక పూజలు చేసి జంధ్యాలు మార్చుకోవడం ఆనవాయితీగా వస్తోందని కరప సిద్ధాంతి గారుఖావ ఝ్జల కొండయ్య సిద్ధాంతి, కరప, యండమూరు అర్చకులు పెద్దింటి గోపాలకృష్ణ, పెద్దింటి సీతారామం తెలిపారు.

క్యాన్సర్ వార్డులో రాఖీ పండగ

- సాంత్వన పొందిన బాధితులు

కాకినాడ క్రైం: ప్రాణాంతక క్యాన్సర్‌తో బాధపడుతున్న బాధితులు అక్కాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు నోచుకున్నారు.. మంచానికే పరిమితమై తమ ఆరోగ్య అవసరాల కోసం 'సిస్టర్' అని పిలిచినంత మాత్రానికే సహృదయులైన ఆ నర్సులు రక్షా బంధాన్నే రక్త బంధంగా ముడేశారు. మృత్యువుతో పోరాడుతూ క్షణమొక గండంలా గడుపుతున్న దీనార్థులకు సేవలందిస్తూనే సాంత్వననిచ్చారు. అందరూ ఉండీ ఏమీ కాని అనాథల పాలిట అక్కచెల్లెమ్మలయ్యారు. శనివారం రాఖీ పండగ సందర్భంగా కాకినాడ జీజీహెచ్‌లోని క్యాన్సర్ వార్డులో ఓ అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. కాకినాడ జీజీహెచ్ క్యాన్సర్ వార్డులో స్టాఫ్ నర్సులు మామిడి చిన్నారి, పెయ్యల సత్యసుధ, రేగుల సుమప్రియ, రేచల్ ప్రిస్కిల్లా, పులిదిండి సుధ, రామవరపు భవాని రక్షాబంధన్ రోజున తమ విధుల్లో భాగంగా సేవలందిస్తూనే క్యాన్సర్ రోగులకు సాంత్వననిచ్చారు. వార్డులో ప్రాణాంతక స్థితిలో చికిత్స పొందుతున్న బాధితులకు రాఖీలు కట్టి రోగ పీడితుల మనసుకు ఆహ్లాదం కలిగించారు, మేమున్నామనే మనోధైర్యాన్నిచ్చారు. రాఖీ కట్టించుకున్న కొందరు కన్నీళ్లు పెట్టుకోవడం చూసిన వారికి హృదయం ద్రవించింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్య కుమారి, హెచ్ఓడీల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



క్యాన్సర్ వార్డులో గొంతు క్యాన్సర్ బాధితుడికి రాఖీ కడుతున్న స్టాఫ్ నర్సు

అనుబంధాలకు ప్రతీక రాఖీ

కాకినాడ రూరల్/ కరప: అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగను కాకినాడ రూరల్‌లో శనివారం ఘనంగా జరుపుకొన్నారు. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలను కట్టారు. సర్పవరం వద్ద బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలోని బ్రహ్మకుమారీలు బృందాలుగా వెళ్లి కాకినాడ, రూరల్ గ్రామాల్లో పలువురికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండగను కరప మండల పరిధిలోని గ్రామాల్లో ఘనంగా జరుపుకొన్నారు. అన్నా చెల్లెళ్లు ఒకరికొకరు కష్టసుఖాల్లో కడవరకూ తోడుగా ఉంటామని రాఖీలు కట్టుకున్నారు.



రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ వైడీ రామారావుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ఉత్సాహంగా జాతీయ హాకీ పోటీలు



హాకీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ షణ్మోహన్, ఆర్మీ ఆఫీసర్ రాకేష్‌శర్మ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 15వ జాతీయ మహిళల జూనియర్ హాకీ పోటీలు శనివారం కాకినాడ డీఎస్ఏలో ఉత్సాహంగా జరిగాయి. క్వాటర్ ఫైనల్స్‌లో భాగంగా నాలుగు మ్యాచ్‌లు నిర్వహించారు. కలెక్టర్ షణ్మోహన్, జోనల్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ బ్రిగేడియర్ రాకేష్ శర్మ అవాస్తిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి మ్యాచ్‌లను తిలకించారు. జార్ఖండ్, పంజాబ్ మధ్య జరిగిన మ్యాచ్‌ను ప్రారంభించి, ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడా స్ఫూర్తి చాటుతూ ఉత్తమ ప్రతిభను కనబరచాలని కోరారు. క్వాటర్ ఫైనల్స్‌లో భాగంగా ఒడిశా, హర్యానా మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా 4-1 స్కోర్‌తో, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరుజట్లు 1-1 గోల్స్ నమోదు చేయగా షూట్ అవుట్‌లో చత్తీస్‌గఢ్ 2-1తో విజయం సాధించింది. జార్ఖండ్, పంజాబ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ 3-1 స్కోర్‌తో, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తర్‌ప్రదేశ్ 2-1 స్కోర్‌తో గెలుపొందాయి. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, హాకీ సంఘ కార్యదర్శి హర్షవర్దన్, కోశాధికారి పి.థామస్, భవానీ శంకర్, వి.రవిరాజులు పోటీలు పర్యవేక్షించారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

పెద్దాపురం: మండలంలోని కట్టమూరు గ్రామ శివారులో సారాతయారీకి వినియోగించే సుమారు 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు పెద్దాపురం ఎక్సైజ్ సీఐ మౌనిక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఐ విజయ్‌శంకర్, ఎక్సైజ్ సీఐ అర్జునరావుల ఆధ్వర్యంలో కట్టమూరు శివారు పంట పొలాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీలపై దాడులు జరిపి 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. మండలంలోని అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించామని, చట్టాన్ని ఉల్లంఘిస్తే సహించేది లేదని ఎక్సైజ్ హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

సామర్లకోట: పట్టణంలో వేంచేసియున్న అతిపూరాతన విష్ణు ఆలయం మాండవ్యనారాయణస్వామి గ్రామోత్సవం శనివారం భక్తి శ్రద్ధలతో సాగింది. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు, శ్రీదేవి, భూమి అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహిచారు. మహిళా భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామి వారి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా అయోధ్యరామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం జరిగింది.

విద్యా సంస్థల పూర్వ వైభవానికి కృషి

బాలాజీచెరువు: ఎయిడెడ్ విద్యా సంస్థల పూర్వ వైభవానికి ఆయా యాజమాన్యాలు కృషి చేయాలని రాష్ట్ర నాయకుడు చిట్టిబాబు అన్నారు. స్థానిక ఎంఎస్ఎన్ పాఠశాలలో శనివారం ఎయిడెడ్ విద్యా సంస్థల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడెడ్ సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించాలని, జీఓ వన్ ప్రకారం నియామకాలు జరిగేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఇటీవల కోర్టు కేసుల నేపథ్యంలో మైనార్టీ, నాన్ మైనార్టీ పాఠశాలలుగా విభజించడం రాజ్యాంగ విరుద్ధమని, దీనిపై న్యాయ పోరాటానికి ప్రతి పాఠశాల సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ మాట్లాడుతూ 2004 నుంచి ఎయిడెడ్ విద్యా సంస్థలపై ఆంక్షలు విధిస్తూ వచ్చారని, హైకోర్టు ఉత్తర్వులు సైతం ఖాతరు చేయకపోవడంతో అధికారులు కోర్టులో కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ఎయిడెడ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. సమావేశంలో ఎయిడెడ్ విద్యా సంస్థల ప్రతినిధులు ఐజయ్య, నళిని, సాగర్, ఉభయ గోదావరి జిల్లాల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



ఎయిడెడ్ విద్యా సంస్థల సమావేశంలో యాజమాన్యాలు

ఏరులై పారుతున్న మద్యం

- ఏపీని లిక్కర్ బౌల్‌గా మార్చేస్తున్న చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ నేత జమ్మలమడక నాగమణి



కాకినాడ రూరల్: రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా ప్రఖ్యాతి గాంచిన ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు ప్రభుత్వం లిక్కర్ బౌల్‌గా మార్చేసిందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి అన్నారు. కాకినాడ 49వ డివిజన్ కొత్త గైగోలుపాడులోని తన నివాసం వద్ద శనివారం సాయంత్రం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతుందన్నారు. అనేక కుటుంబాలు మద్యం వల్ల వీధిన పడుతున్నాయన్నారు. విచ్చలవిడిగా మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం, వీధివీధినా బెల్ట్ షాపులు నెలకొల్పడంతో మద్యం మత్తులో పేద, మధ్య తరగతి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సారథిగా చెప్పుకొనే బాబు మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు ముడుపుల మత్తులో మద్యం దుకాణాలు లేని ప్రాంతాల్లో అనధికార అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. రెగ్యులర్ లైసెన్స్ పొందలేక పోతున్న వ్యాపారులు ఇప్పటికి ప్రొవిజనల్ లైసెన్స్‌పైనే 489 దుకాణాలు నడుపుతున్నారని, బెల్ట్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు పెరగడంతో బాటిల్‌పై రూ.10 నుంచి రూ.30 వరకు అదనంగా అమ్మకాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మద్యం అమ్మకాల టార్గెట్‌లతో ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడంతో నియంత్రణ కొరవడిందన్నారు. ఆర్టీజీఎస్ సర్వేలో ఎమ్మార్పీ ఉల్లంఘనలు ఉన్నాయన్న 87.2 శాతం ఒక వర్గం ప్రజల అభిప్రాయాలను గతంలో ఎల్లో మీడియా ప్రచురించిందని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం అమ్మకాలు తగ్గాయని గణాంకాలు చెప్పాయని, చంద్రబాబు పాలనలో మద్యం ఏరులై పారుతుందన్నారు.

సకాలంలో నీటి తీరువా చెల్లించాలి

కొత్తపల్లి: రైతులు సకాలంలో నీటి తీరువా పన్ను చెల్లించాలని తహసీల్దార్ చిన్నారావు సూచించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలో నీటి తీరువా పన్ను చెల్లించేలా చర్యలు చేపట్టిందన్నారు. 1432, 1433, 1434 ఫసలీలకు సంబంధించి గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ వద్ద ఆన్‌లైన్ విధానంలో పన్ను చెల్లించి రసీదు పొందాలని సూచించారు. నీటి తీరువా పన్ను సాధ్యమైనంత త్వంగా చెల్లించి సహకరించాలని కోరారు.

రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చిన వనదుర్గమ్మ

అన్నవరం: రత్నగిరిపై గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వనదుర్గమ్మ శ్రావణ మాస జాతర మహోత్సవాలు శనివారం నిర్వహించిన ప్రత్యంగిర, చండీ హోమాల పూర్ణాహుతితో ముగిశాయి. చివరిరోజు అమ్మవారు ఒక చేతిలో శంఖం, మరో చేతిలో చక్రం, ఇంకో చేతిలో చెరుకుగడ, మరో చేతిని అభయహస్తంతో రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు నిర్వహించారు. అనంతరం చండీ, ప్రత్యంగిర హోమాలు ప్రారంభించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు.

అయోమయం..

వనదుర్గమ్మ జాతర ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయం వద్ద చండీ హోమం, ఆలయం దిగువ అంతస్తులో శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యంగిర హోమం పూర్ణాహుతి ఒకే సమయంలో నిర్వహించడంతో భక్తుల్లో అయోమయం నెలకొంది. రెండు హోమాల పూర్ణాహుతి ఉదయం 11 గంటలకే నిర్వహించారు. రెండు హోమ గుండాల్లో ఏకకాలంలో హోమ ద్రవ్యాలు సమర్పించారు. ఆలయం వద్ద జరిగిన చండీహోమంలో ఈఓ వీర్ల సుబ్బారావు పాల్గొనడంతో ప్రత్యంగిర హోమం వద్ద గల వేదపండితులు, అర్చకులు చండీహోమం వద్దకే వెళ్లిపోయారు. దిగువన అంతస్తులో ప్రత్యంగిర హోమం వద్ద అర్చకుడు, వ్రతపురోహితులు మిగిలారు.

రేషన్ బియ్యం పక్కదారి పడితే కఠిన చర్యలు

గోకవరం: రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడి బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సహాయ పౌరసరఫరాల అధికారి నాగాంజనేయులు రేషన్ డీలర్లను హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన విస్తృత తనిఖీల్లో భాగంగా శనివారం ఎంఎస్ఓ శాంతిప్రియతో కలసి గోకవరం మండలంలోని పలు రేషన్ షాపులను తనిఖీ చేశారు. రేషన్ పంపిణీపై లబ్ధిదారులను ఆరా తీశారు. రేషన్ సక్రమంగా పంపిణీ చేయకపోతే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అయన మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, డీఎస్ఓ పార్వతి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



బియ్యం నిల్వలు తనిఖీ చేస్తున్న నాగాంజనేయులు